సాక్షి
నల్లగొండ

గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



వన దేవతల జాతరలు
ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల మినీ మేడారాలుగా కీర్తించబడుతున్న వనదేవతల జాతరలు ప్రారంభమయ్యాయి. - 8లో



యాదాద్రిలో ఎదుర్కోలు..
పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. - 10లో



ప్రజలకు నమ్మకం పోతోంది
కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం పోతోందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. - 10లో

అడ్డగోలుగా ఆర్డర్లు!

విద్యుత్ శాఖలో టెండర్ లేకుండానే పరికరాల కొనుగోలు

- ఎమర్జెన్సీ సాకుతో తమకు నచ్చిన కాంట్రాక్టర్లకు అప్పగింత
- రెండున్నరేళ్లలో రూ.2.89 కోట్ల పర్చేజింగ్ చేపట్టిన విద్యుత్ శాఖ
- అందులో 60 శాతం నామినేషన్‌పైనే..



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : విద్యుత్ శాఖలో పరికరాల కొనుగోలుకు సంబంధించి అధికారులు ఇష్టానుసారంగా ఆర్డర్లు ఇచ్చారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు ఆర్డర్లు ఇవ్వాల్సి ఉన్నా.. తమకు సంబంధించిన వారికి నామినేషన్ (టెండరు లేకుండానే) పద్ధతిన 60 శాతం పర్చేజింగ్ ఆర్డర్స్ అప్పగించి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా కొంతమంది కాంట్రాక్టర్లు విద్యుత్ శాఖ స్టోర్‌కు మెటీరియల్ పూర్తి స్థాయిలో సప్లయ్ చేయకున్నా పూర్తిగా సరఫరా చేసినట్లు రికార్డులు సృష్టించి బిల్లులు పొందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రైతులకు కూడా స్టోర్ నుంచి పూర్తి స్థాయిలో మెటీరియల్ ఇవ్వకపోవడంతో వారు సొంత డబ్బుతో కొనుక్కోవాల్సి వస్తోంది. దీంతో అటు రైతులు, ఇటు ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతోంది.

నిబంధనలను తుంగలో తొక్కి..

విద్యుత్ పరికరాలైన ఏబీసీ స్విచ్‌లు, గ్లౌజ్‌లు, ఎర్త్ రాడ్‌లు, మేల్ ఫిమేల్ స్విచ్‌లు, ఇతర పరికరాలను సరఫరా చేసేందుకు నల్లగొండ విద్యుత్ శాఖ ఎస్‌ఈ పరిధిలో టెండర్లు పిలిచి అందులో తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్లకు అప్పగించాలి. అయితే అత్యవసరం ఉన్నప్పుడు మాత్రమే రూ.5 లక్షలలోపు వాటిని నామినేషన్‌పై అప్పగించే నిబంధన ఉంది. దాన్ని ఆసరాగా చేసుకొని పెద్ద మొత్తాలను విభజించి పలు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అత్యవసరం అనే సాకుతో మొత్తంలో నామినేషన్‌పైనే అప్పగించినట్లు తెలిసింది.

ఇద్దరు కాంట్రాక్టర్లకు చెందిన కంపెనీలకే అప్పగింత

జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయ పరిధిలో రెండున్నరేళ్ల కాలంలో రూ.2.89 కోట్ల పర్చేజింగ్ ఆర్డర్లను కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇందులో దాదాపు 60 శాతం టెండర్లు లేకుండానే ఇవ్వడం విస్మయం కలిగిస్తోంది. పైగా వాటిని ఇద్దరు కాంట్రాక్టర్లకు సంబంధించిన 14 కంపెనీలకు అప్పగించినట్లు తెలిసింది. మహబూబ్‌నగర్‌కు చెందిన 8 కంపెనీలు, కర్నూలుకు చెందిన 6 కంపెనీలకు టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతినే అప్పగించగా.. జిల్లాలకు చెందిన 20 కంపెనీలకు మాత్రం 40 శాతం ఓపెన్ టెండర్లు పిలిచి అప్పగించారు.

ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా రికార్డులు..

ఆర్డర్లు పొందిన కాంట్రాక్టర్లంతా విద్యుత్ పరికరాలను కొనుగోలు చేసి స్టోర్‌కు అప్పగించాలి. అయితే పూర్తిస్థాయిలో మెటీరియల్ ఇవ్వకపోయినా కాంట్రాక్టర్లు పూర్తిగా ఇచ్చారని నమోదు చేసి బిల్లులు డ్రా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైతే వారికి పూర్తిస్థాయిలో మెటీరియల్ ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లు పూర్తి స్థాయిలో స్టోర్‌కు మెటీరియల్ సప్లయ్ చేస్తే రైతులకు కూడా అవి ఇచ్చేవారు. అయితే కాంట్రాక్టర్లు మెటీరియల్ ఇవ్వకపోయినా, వారి నుంచి కొంత మంది అధికారులు ముడుపులు పుచ్చుకొని వచ్చినట్లు రికార్డు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాంతో కాంట్రాక్టర్లు మెటీరియల్‌కు పూర్తిస్థాయిలో బిల్లులు డ్రా చేస్తున్నారు. ఇక రైతులకు తక్కువ మెటీరియల్ ఇస్తుండటంతో వారు సొంతంగా కొనుగోలు చేయాల్సి వస్తోంది.

పెద్ద మొత్తంలో చేతులు మారినట్లు ఆరోపణలు

విద్యుత్ శాఖ ఉన్నతాధికారి టెండర్లు పిలువకుండానే తన సంబంధికులైన కాంట్రాక్టర్లకు పర్చేజింగ్ ఆర్డర్లను నేరుగా అప్పగించినట్లు తెలుస్తోంది. నామినేషన్‌పై పర్చేజింగ్ ఆర్డర్లు పొందిన కాంట్రాక్టర్ల నుంచి పెద్ద మొత్తంలో అధికారులకు ముడుపులు అందాయన్న ఆరోపణలు ఉన్నాయి. రెండున్నరేళ్లుగా విద్యుత్ శాఖ మెటీరియల్ విషయంలో రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఈ వ్యవహారం సాగుతోందని పలువురు అంటున్నారు. దీనిపై వివరణ కోరేందు జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈని ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.



గుర్రంపోడు మండలం కట్టవారిగూడెం వద్ద గుంతలమయంగా ఉన్న నల్లగొండ-కొండమల్లేపల్లి రోడ్డు

నల్లగొండ-కొండమల్లేపల్లి రోడ్డు ఇక.. జాతీయ రహదారి

- కేంద్ర మంత్రికి ప్రతిపాదనలు సమర్పించిన మంత్రి కోమటిరెడ్డి
- ఈ రోడ్డు పూర్తయితే తీరనున్న ప్రయాణికుల కష్టాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నల్లగొండ-కొండమల్లేపల్లి రోడ్డుకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలోని 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మంగళవారం ఢిల్లీలో కోరారు. అందులో నల్లగొండ-కొండమల్లేపల్లి రోడ్డును చేర్చడంతో ఈ రోడ్డుకు మంచి రోజులు రానున్నాయని జిల్లా ప్రజలకు పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి ఈ రోడ్డు సక్రమంగా లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిందే. నల్లగొండ నుంచి కొండమల్లేపల్లి వరకు దాదాపు 50 కిలోమీటర్ల పొడవునా రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. ఏళ్ల తరబడి ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఆ రోడ్డుకు మోక్షం లభించడం లేదు. గతంలో ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో రోడ్డును మరమ్మతు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.

గంటలోనే కొండమల్లేపల్లి వెళ్లే అవకాశం..

నల్లగొండ నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే 100 కిలోమీటర్లు ఉన్నప్పటికీ రెండుగంటల్లో చేరుకునే అవకాశం ఉంది. కానీ నల్లగొండ నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండమల్లేపల్లికి వెళ్లాలంటే మాత్రం 2 గంటల సమయం పడుతోంది. ఎప్పుడో వేసిన ఈ రోడ్డు గుంతల మయంగా మారింది. ఈ రోడ్డును జాతీయ రహదారిగా మారిస్తే కనీసంగా నాలుగు లేన్ల రోడ్డుగా అభివృద్ధి చెందనుంది. దీంతో గంటలోనే నల్లగొండ నుంచి కొండమల్లేపల్లి చేరుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రయాణికుల కష్టాలు తీరుతాయి. రోడ్డు వెంట గ్రామాల ప్రజలకు మేలు జరగనుంది. దానికి తోడు జాతీయ రహదారి అవుతున్నందున భూముల విలువ కూడా మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ రోడ్డును జాతీయ రహదారిగా మార్చితే జడ్చర్ల నుంచి మల్లేపల్లి మీదుగా కోదాడవైపు వెళ్లే జాతీయ రహదారి, హైదరాబాద్ నుంచి నాగార్జున సాగర్ వైపు వెళ్లే రహదారికి దీనిని అనుసంధానం చేసే అవకాశం ఉంది.

రూ.700 కోట్లతో నల్లగొండ బైపాస్

నకిరేకల్ మీద నుంచి మాచర్ల వెళ్లే జాతీయ రహదారి పనులు నల్లగొండ పట్టణంలోని పానగల్ నుంచి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా దేవరకొండ రోడ్డు నుంచి సాగర్ రోడ్డు మీదుగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఈ రహదారి పనులు పూర్తి కావచ్చాయి. అయితే పానగల్ నుంచి నల్లగొండ పట్టణం మీదుగా జాతీయ రహదారి వెళ్తుండడం వల్ల పట్టణంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దాంతో పానగల్ అద్దంకి రోడ్డు నుంచి సాగర్ రోడ్డుకు వెళ్లే విధంగా బైపాస్ మంజూరు చేయాలని గతంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన విషయం తెలిసిందే. ఆ బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.700 కోట్లు మంజూరైనట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, విధులపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చినట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఎనిమిది మంది చొప్పున ఎంపిక చేసిన ట్రైనర్లకు పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, విధులపై జిల్లా మాస్టర్ ట్రైనర్స్ బృందం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో శిక్షణ నోడల్ ఆఫీసర్, వ్యవసాయ శాఖ ఏడీ హుస్సేన్ బాబు, మాస్టర్ ట్రైనర్స్ తరాల పరమేష్, బాలు, గోపి, సోమయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బియ్యం పంపిణీ చేయాలి



గోదామును పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

మిర్యాలగూడ : రేషన్ కార్డుదారులకు సకాలంలో బియ్యం పంపిణీ చేయాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్ బియ్యం గోదాములను సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్ రావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ డీలర్లకు ఈనెల 29లోపు బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు. డీలర్లు కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేయవద్దని, అలా చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో ప్రతి నెల 5వ తేదీన రేషన్ షాపులు తెరిచి బియ్యం ఇచ్చేవారని అలా కాకుండా మార్చి నుంచి 1వ తేదీ నుంచి షాపులు తెరిచి బియ్యం పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ ఆర్‌ఐ సురేందర్‌సింగ్, గోదాం ఇన్‌చార్జి సుధాకర్ పాల్గొన్నారు.

కట్టవారిగూడెంలో విష జ్వరాలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

గుర్రంపోడు : గుర్రంపోడు మండలంలోని కట్టవారిగూడెం గ్రామంలో 60 మందికి పైగా విషజ్వరాల బారిన పడటంతో బుధవారం గ్రామంలో పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాల బారిన పడిన వారిని పరీక్షించి రక్త నమూనాలు సేకరించారు. చికున్ గున్యా, డెంగ్యూ జ్వరాలుగా ప్రాథమికంగా గుర్తించారు. రక్త పరీక్షల నివేదిక ప్రకారం వైద్య సేవలు కొనసాగిస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం జ్వరాలు సోకిన వారికి ఆర్థరైటీస్ వచ్చి రెండు నెలలుగా వంటి నొప్పులతో బాధపడుతున్నట్లు గుర్తించామని మండల వైద్యాధికారి భవానీ చక్రవర్తి తెలిపారు. వైద్య పరీక్షలు నివేదికలు రాగానే మందులు అందించి చికిత్సలు జరుపుతామని అన్నారు. వైద్య శిబిరంలో మాజీ సర్పంచ్ చాడ చక్రవర్తి, వైద్యసిబ్బంది జగదీష్, విమల పాల్గొన్నారు.

మాతృభాషను గౌరవించాలి



మాట్లాడుతున్న అద్దంకి లక్ష్మయ్య

రామగిరి(నల్లగొండ) : మాతృ భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కవి, గాయకుడు అద్దంకి లక్ష్మయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండలోని ఎన్జీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి భాషపై అభిమానం కలిగి ఉన్నప్పుడే వారు అన్ని విషయాల్లో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ ప్రపంచంలో అనేక భాషలు ఉన్నాయని, ఎవరి భాష వారికి ఇష్టమైనదని, ఇతర భాషలను కూడా గౌరవించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ మునీర్, తెలుగు శాఖ ఇన్‌చార్జి డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, లవీందర్‌రెడ్డి, గోవర్ధనగిరి, సైదులు, ప్రభాకర్, రమ్య, అంజయ్య, ఏ.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ గౌరవం పెంచాలి



మాట్లాడుతున్న ఎస్పీ చందనదీప్తి



పాల్గొన్న పోలీసు అభ్యర్థులు

- ఏఆర్ కానిస్టేబుళ్ల శిక్షణ శిబిరంలో ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండక్రైం : సమాజంలో పోలీస్‌శాఖ గౌరవాన్ని పెంచే విధంగా అంకితభావంతో పని చేయాలని ఎస్పీ చందనాదీప్తి పేర్కొన్నారు. బుధవారం నల్లగొండలోని పోలీసు శిక్షణ కేంద్రంలో పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన ఏఆర్ కానిస్టేబుళ్లకు తొమ్మిది నెలల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎంతో మంది పోలీసు ఉద్యోగాల కోసం పోటీ పడుతుంటారని, ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు ప్రజలకు సేవచేసే అవకాశం లభిస్తుందన్నారు. శిక్షణలో ఇండోర్, అవుట్ డోర్‌లో నిష్ణాతులుగా తయారు కావాలన్నారు. సంఘ విద్రోహ శక్తులను అణిచివేయడంలో ప్రాణ త్యాగానికి సిద్ధపడేది పోలీసులు మాత్రమే అన్నారు. రోజూ వ్యాయామంతో ఒత్తిడిని అధిగమించాలని సూచించారు. సంగారెడ్డి, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుంచి వచ్చిన ఏఆర్ విభాగానికి చెందిన 203 మంది పురుష అభ్యర్థులు శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్ రాములునాయక్, డీఎస్పీ విఠల్‌రెడ్డి, సురేష్, లక్ష్మీనారాయణ, సీఐలు గోపి, సత్యనారాయణ, కొండల్‌రెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 22 వరకు పాలీసెట్ దరఖాస్తులు

రామగిరి(నల్లగొండ) : పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం పాలీసెట్- 2024కు ఏప్రిల్ 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని నల్లగొండలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జానకీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమయ్యాని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలు రూ.250, ఇతరులు రూ.500 చెల్లించి poycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 24 వరకు రూ.100 అపరాధ రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ముగిసిన చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు



స్వామి అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజున ఏకాదశ రుద్రాభిషేకం, మహానివేదన, నీరాజన మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం గజవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్, ఈఓ నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, ఉప ప్రధానార్చకుడు ఉప్పల సతీష్‌శర్మ, మామిళ్లపల్లి రాంబాబుశర్మ, మామిళ్లపల్లి సురేష్‌శర్మ, రెగిచేడు శ్రీకాంత్‌శర్మ, మామిళ్లపల్లి నాగయ్యశర్మ, పోతులపాటి జగదీష్‌శర్మ, రుగ్వేద పండితుడు రవితేజ, యజుర్వేద పండితుడు రాము, సామవేద పండితుడు పోతులపాటి శశిశర్మ, ఆధర్వణ వేద పండితుడు పవన్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శంకర్, రవీందర్‌రెడ్డి, నాయకులు నేతగాని కృష్ణ, రేగట్టె నవీన్‌రెడ్డి, నర్సిరెడ్డి, శశిధర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, వెంకటయ్య, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల నాలుగు డీఆర్‌లు వెంటనే విడుదల చేయడంతో పాటు ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యాన్ని అందించాలని కోరారు. ఆర్టీసీ బస్సు చార్జీల్లో 50శాతం రాయితీ కల్పించాలన్నారు. అనంతరం పలు తీర్మానాలు ఆమోదించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్ల శ్రీశైలం, తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి, పంగునూరి లింగయ్య, నారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి, ఐజాక్, వనం బుచ్చయ్య, శాంతకుమారి, యూసుఫ్ షరీఫ్, వసంత, వీరయ్య పాల్గొన్నారు.

గొర్రెల డీడీలు వాపస్?

- గొర్రెల పంపిణీ ఊసెత్తని ప్రభుత్వం
- గొల్ల కురుమల వాటాధనం తిరిగి ఇవ్వాలని నిర్ణయం!
- వడ్డీ మీద పడుతుందని లబ్ధిదారుల ఆవేదన



నల్లగొండ అగ్రికల్చర్ : గొర్రెల యూనిట్ల కోసం కట్టిన డబ్బులను గొల్లకురుమలకు వాపస్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా రెండవ విడతలో గొర్రెల యూనిట్ల పంపిణీ కోసం డీడీలు కట్టాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోరడంతో జిల్లాలో సుమారు 12,000 వేల మంది గొల్లకురుమలు ఒక్కొక్కరు తమ వాటా ధనంగా రూ.43,750 డీడీలు చెల్లించారు. ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక్క పొట్టేళ్లకు కలిపి యూనిట్ ధర రూ.1లక్షా 75 వేలుగా నిర్ణయించారు. లబ్ధిదారుడి వాటా ధనం రూ.43,750 చెల్లిస్తే మిగతా డబ్బులను ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇస్తుంది. కానీ యూనిట్లకు డీడీలు చెల్లించి ఏడాదికి పైగా గడుస్తున్నప్పటికీ యూనిట్లపై ఎలాంటి స్పష్టత రాలేదు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో హడావుడిగా సుమారు 5 వేల మందికి గొర్రెల గొర్రెలు పంపిణీ చేశారు. ఆ తర్వాత ఆ ఊసే లేకుండా పోయింది.

గతంలో అక్రమాలు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గొర్రెల పంపిణీపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గొర్రెల యూనిట్ల పంపిణీలో అనేక అక్రమాలు జరిగినట్లు కాగ్ తన నివేదికలో ప్రస్తావించింది. జిల్లాలో కూడా మొదటి, రెండవ విడత పంపిణీలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెండవ విడత గొర్రెల యూనిట్ల పంపిణీ జోలికి వెళ్తే తేనెతుట్టెను కదిలించినట్లు అవుతుందని రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల్లో గుబులు పట్టుకుంది. గొర్రెల పంపిణీ జోలికి వెళ్లకుంటేనే బాగుంటుందన్న భావనలో రాష్ట్రస్థాయిలోని అధికారులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని జిల్లాల వారీగా మౌఖికంగా ఆదేశాలను కూడా జారీ చేశారని తెలిసింది. డీడీలను విత్‌డ్రా చేసుకునేందుకు గొల్లకురుమల నుంచి దరఖాస్తులను తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు, గొల్లకురుమ సంఘాలకు సూచించారు. విత్‌డ్రా కోసం దరఖాస్తులను చేసుకుంటే వారికి రెండు వారాల్లోపు డబ్బులను తిరిగి చెల్లించనున్నట్లు తెలిసింది.

వడ్డీ ఎవరు భరిస్తారు..

గొర్రెల యూనిట్ల కోసం అప్పులు చేసి డీడీలు కడితే తిరిగి తమకు డీడీలు ఇస్తే వడ్డీని ఎవరు భరిస్తారనే ఆందోళన గొల్లకుర్మల్లో నెలకొంది. సంవత్సరానికి కనీసం రూ.15 వేల వరకు వడ్డీ మీదపడుతుందన్న భయం వారిని వేధిస్తుంది. ప్రభుత్వం తమకు వడ్డీతో సహా చెల్లించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆదేశాలు రాలేదు



గొర్రెల యూనిట్ల కోసం డీడీలు కట్టిన లబ్ధిదారులకు డీడీలు వాపస్ చేయాలని మాకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. జిల్లాలో డీడీలు కట్టిన వారి వివరాలను కలెక్టర్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుని ఆదేశించినా అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ సుబ్బారావు,
జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

23న జాబ్ మేళా

నల్లగొండ : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 23న ఉదయం 10 గంటలకు మిర్యాలగూడ రోడ్డు ఐటీఐ భవన్‌లో గల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌ఎన్ లేబోరేటరీస్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు, అవేజ్ లిమిటెడ్, అపోలో హోం హెల్త్‌కేర్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం అర్హత గల అభ్యర్థులు నేరుగా వారి ఒరిజినల్స్ సర్టిఫికెట్స్, జిరాక్స్‌లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీల్లో అర్హత, నైపుణ్యాలను బట్టి నెలకు రూ.11 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న నిరుద్యోగులు పూర్తి వివరాల కోసం 9951720856 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి దీప్తి

- న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి దీప్తి

చందంపేట : చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి దీప్తి పేర్కొన్నారు. బుధవారం చందంపేట మండలంలోని కంబాలపల్లి గ్రామంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు, విధులపై అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కొండల్‌రెడ్డి, డీఈఓ భిక్షపతి, డీఆర్‌డీఈ రాజ్‌కుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి సక్కుబాయి, భరోసా ఎస్‌ఐ అంజలి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృష్ణకుమారి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ సామ్యానాయక్, సీడీపీఓ ఖాతిజాబేగం, సీనియర్ అసిస్టెంట్ నిఖిల్, ఆర్‌ఐ నజీర్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగ్గురి బైండోవర్

కట్టంగూర్ : అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను కట్టంగూర్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన నౌషద్, సోమన్, ఆజంలు నల్లగొండలో అద్దెకు తీసుకొని ద్విచక్రవాహనంపై గ్రామాలు తిరుగుతూ బట్టలు అమ్ముకుంటూ జీవన సాగిస్తున్నారు. మండల కేంద్రంలోని కల్మెర రోడ్డులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకుని విచారించగా పొంతలేని తలతిక్క సమాధానాలు చెప్పటంతో అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ గుగులోతు ప్రసాద్ ముందు బైండోవర్ చేశారు.

గొర్రెలు అపహరణ

నార్కట్‌పల్లి : గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెలను అపహరించారు. నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం శివారులో బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామానికి చెందిన రేగట్టె భూపాల్‌రెడ్డి వ్యవసాయంతో పాటు ఎల్లారెడ్డిగూడెం శివారులోని తన వ్యవసాయ క్షేత్రంలో షెడ్డు వేసి గొర్రెలను పెంచుతున్నాడు. వాటి ఆలనా పాలనకు సూపర్‌వైజర్‌ను కూడా నియమించాడు. ఈ నెల 15వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి షెడ్డులోని 110 గొర్రెలను అపహరించుకుపోయారు. మరుసటి రోజు సూపర్‌వైజర్ వచ్చి చూడగా గొర్రెలు కనిపించకపోవడంతో యజమానికి సమాచారం ఇచ్చారు. భూపాల్‌రెడ్డి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

నార్కట్‌పల్లి : ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నార్కట్‌పల్లి మండలం దాసరిగూడెంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దాసరిగూడెం గ్రామానికి చెందిన పాలగోని యోగిత్ (26)కు తన భార్య ప్రవళికతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రవళిక ఇటీవల పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన యోగిత్ బుధవారం ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించే సరికి మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

పెద్దఅడిశర్లపల్లి : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పెద్దఅడిశర్లపల్లి మండలం నంబాపురంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నంబాపురం గ్రామానికి చెందిన రమావత్ భీమా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భీమా రెండు మూడు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అతడికి స్థానికంగా వైద్యం చేయించారు. అయినా పరిస్థితి విషమించడంతో హాలియాలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టరు నిర్ధారించాడు. భీమా మృతిపై అనుమానం ఉందని మృతుడి భార్య సైదీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

వన దేవతల జాతరలు ప్రారంభం


పెన్‌పహాడ్ : నైవేద్యం సమర్పించేందుకు బోనాలతో వస్తున్న మహిళలు


పెన్‌పహాడ్ : వనదేవతలను దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

- గద్దెపైకి సారలమ్మ.. నేడు రానున్న సమ్మక్క
- పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

పెన్‌పహాడ్ : ఉమ్మడి జిల్లాలోని పెన్‌పహాడ్, పెద్దవూర, రాజాపేట మండలాల్లో మినీ మేడారాలుగా కీర్తించబడుతున్న వనదేవతల జాతరలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా మండలాల పరిధిలో జరుపుతున్న జాతరలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వనదేవతల గద్దెలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్ జిల్లా మేడారానికి చెందిన సమ్మక్కసారలమ్మ దేవతామూర్తులకు పోలిన జాతరగా పేరుగాంచిన పెన్‌పహాడ్ మండల పరిధిలోని గాజులమల్కాపురం సమ్మక్క-సారలమ్మ దేవతామూర్తులను దర్శించుకునేందుకు భకులు తరలివచ్చారు. గ్రామం నుంచి దేవతామూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి గద్దెలపై ఉంచారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున బోనాలు చెల్లించుకున్నారు. సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. బంగారం (బెల్లం) మొక్కుబడులుగా చెల్లించారు. నారికాయలు, గొర్రె, మేక పొట్టేళ్ల, కోళ్ల బలిచ్చారు. నిర్వాహకులు తాగునీరు, లైటింగ్ సౌకర్యం ఏర్పాటుచేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శివలింగం, నాగుపాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తులు అమ్మవారి పూనకంతో ఊగిపోయారు. నేడు జాతర ఉత్సవాల సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి కోలాటం, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ పోటీలను ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండి ధనమ్మ రామకృష్ణారెడ్డి, బండి మధుసూధన్‌రెడ్డి, కుందూరు ప్రభాకర్‌రెడ్డి, బెల్లంకొండ శ్రీరాములు, కుందూరు వెంకట్‌రెడ్డి, దొంతగాని గోపయ్య, బచ్చలకూరి రామచంద్రు, మండాది పాపయ్య, భేగం జాన్‌షా, బచ్చలకూరి జానయ్య పాల్గొన్నారు.


రాజాపేట : చల్లూరులో సారలమ్మను ఊరేగింపుగా తీసుకొస్తున్న నిర్వాహకులు

పెద్దవూరలో..

పెద్దవూర: పెద్దవూర మండలంలోని పొట్టిచల్మ ఎక్స్ రోడ్డు వద్ద కృష్ణా నది సమీపంలో కొలువై భక్తుల కోర్కెలు తీర్చే మినీ మేడారంగా పిలిచే సమ్మక్క-సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. ప్రతి సంవత్సరం వనదేవతలైన సమ్మక్క-సారలమ్మ జాతరను ఆలయ ప్రధాన పూజారులు, ధర్మకర్తలైన గుంజ అంజమ్మ, గుంజ షణ్ణురాజు, నాగపురి లక్ష్మిల ఆధ్వర్యంలో అమ్మవార్లకు చీరె సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సమీప గ్రామాల ప్రజలు వనదేవతలను సందర్శించి మొక్కులను సమర్పించారు. నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారు.


పెద్దవూర : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యం

యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని చల్లూరు యాదాద్రి మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా విచ్చేసే భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు బుధవారం నుంచి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా పొట్టిమర్రి, ఇబ్రహింపూర్ చౌరస్తాల నుంచి యాదాద్రి మేడారం అమ్మవార్ల గద్దెలవరకు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు ఉచిత దర్శనం, షాపుల ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.


చల్లూరు ఊరగుట్టపై ఏర్పాటు చేసిన గద్దెలు

గద్దెపైకి సారలమ్మ

రాజాపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని చిన్నమేడారం, చల్లూరు యాదాద్రి మేడారంలో వనదేవతలు సమ్మక్క సారలమ్మలో భాగంగా ఎల్లమ్మ బోనాలతో జాతర ప్రారంభమైంది. బుధవారం చిన్నమేడారం, యాదాద్రి మేడారం సమీపంలోని గుట్టలపై ఉన్న సారలమ్మకు నిర్మాహకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వరాహాన్ని బలిచ్చి డప్పు వాయిద్యాలు, మేళతాలాలతో సమీప కుర్రారం, చల్లూరు గ్రామస్తులు ఊరేగింపుగా ఆలయాలకు బయలు దేరారు. దారిపొడువునా డుప్పు వాయిద్యాలతో శివసత్తుల పూనకాలతో హోరెత్తిపోయింది. ఆలయ ప్రాంగణాలకు చేరుకున్న నిర్వాహకులు సాంప్రదాయ పూజలు నిర్వహించి కుంకుమ భరిణె రూపంలో ఉన్న వెదురు బొంగు సారలమ్మ గద్దెపై ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణాలు జన సంద్రంతో కిక్కిరిసి పోయాయి. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని వడిబియ్యాలు, పసపు, కుంకుమలు, కొబ్బరియాలు, కోళ్ల మేకలు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం పరిసరాల్లో మిఠాయి, బొమ్మలు, గాజుల వంటి వివిధషాపులు వెలిసాయి. గురువారం సమ్మక్క గద్దెలపైకి రానుందని వనదేవతలు కొలువు తీరడంతో శుక్రవారం భక్తులు మొక్కులు తీర్చుకుంటారని నిర్వాహకులు తెలిపారు.

భారీ బందోబస్తు

మండలంలోని చిన్నమేడారం, చల్లూరు యాదాద్రి మేడారం సమ్మక్క సారలమ్మ జాతరల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీసీపీ రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్, రాజాపేట ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డితోపాటు 9మంది ఎస్‌ఐలు, 90 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురు జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం తిరుమలగిరి మండలంలోని జానారెడ్డి కాలనీ గ్రామశివారులో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న జటావత్ రమేష్, రమావత్ భాస్కర్, బొజ్జ సాంబశివరావు, ఉడ్తూరి రమణారెడ్డి, రమావత్ కమల, పొదిల మల్లయ్య, జటావత్ శ్రీను, రమావత్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 35580 నగదు, ఏడు మోటార్ సైకిళ్లు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నారాయణరెడ్డి తెలిపారు.

పుస్తెల తాడు అపహరణ

చివ్వెంల(సూర్యాపేట) : గుర్తుతెలియని వ్యక్తి వృద్ధురాలి మెడలోని పుస్తెల తాడు అపహరించాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మాపురం గ్రామానికి చెందిన కళ్ల రాములమ్మ తన ఇంట్లో వరండాలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెల తాడు లాక్కొని పారిపోయాడు. బాధితురాలు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్ రెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం


సుభద్ర

గుర్రంపోడు : కుటుంబ కలహాలతో ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. గుర్రంపోడు మండలం తేనేపల్లి గ్రామానికి చెందిన బొడ్డు సుభద్ర (32)ఈ నెల ఒకటవ తేదీన భర్త కిరణ్‌తో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇరవై రోజులుగా చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బాధితురాలి కుటుంబ సభ్యులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

ప్రియుడి ఇంటి ఎదుట యువతి ఆందోళన


ప్రియుడి ఎదుట ధర్నాచేస్తున్న యువతి

శాలిగౌరారం: ప్రేమించి పెళ్లికి నిరాకరించి మోసానికి పాల్పడిన ప్రియుడి ఇంటి ఎదుట ఓ యువతి ఆందోళనకు దిగింది. శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆకారం గ్రామానికి చెందిన ఇంద్రకంటి వెంకటేశ్, దుప్పెల్లి ఝాన్సీలు నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల పెళ్లి చేసుకునేందుకు కూడా నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నిశ్చితార్థం కూడా జరిగింది. పెళ్లి చేసుకునే సమయం దగ్గర పడటంతో ఏర్పాట్లు చేసుకుంటుండగా వెంకటేశ్ ఝాన్సీని నిరాకరించాడు. దీంతో ఝాన్సీ తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అతడి ఇంటి ఎదుట బైఠాయించింది. ఝాన్సీ ధర్నాకు ఆమె కుటింబీకులతో పాటూ స్థానిక మహిళలు, మహిళా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

వెంకటేశ్‌పై కేసు

పెళ్లి చేసుకుంటానని నిమ్మించి వెంకటేశ్ మోసం చేశాడంటూ సాయంత్రం ఝాన్సీ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఐలయ్య తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంకటేశ్‌పై ఐపీసీ 420, 376 సెక్షన్ల కింద కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రస్తుతం వెంకటేశ్, కుటింబీకులు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ వివరించారు.

నలుగురిపై కేసు

మిర్యాలగూడ అర్బన్: కత్తులతో నృత్యం చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన నలుగురిపై మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన కృష్ణ, కార్తిక్, మధు, నాగేష్‌లు ఈ నెల 19న చత్రపతి శివాజీ ర్యాలీ జరుగుతున్న సమయంలో కత్తులు పట్టుకుని నృత్యం చేశారు. అనుమతులు లేకుండా కత్తులతో నృత్యం చేశారనే అభియోగం మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఎస్‌ఐ శ్రీను నాయక్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వృద్ధుడు మృతి

మునుగోడు: బైక్ అదుపుతప్పి మురుగు కాల్వలో పడడంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మునుగోడులో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన భీమనపల్లి శంకరయ్య(75) మునుగోడులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరుగుతున్న తమ గ్రామానికి చెందిన యువకుడి వివాహానికి బైక్‌పై హాజరయ్యాడు. వివాహం అనంతరం స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా కమ్మగూడెం వద్ద రక్తపోటు అధికమై మురుగు కాల్వలో కిందపడిపోయాడు. ప్రమాదంలో శంకయ్య తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మేళ్లచెరువు (సూర్యాపేట): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట ఎస్పీ ఎస్పీ రాహుల్‌హెగ్డే నిందితుడి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన బొజ్జగాని రోహిత్ కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. ఇతను 120 గ్రాముల గంజాయిని మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించేందుకు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు రోహిత్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. అతన్ని అరెస్టు చేసి ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న స్థానిక ఎస్‌ఐ.పరమేష్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

మాడుగులపల్లి : మాడుగులపల్లి తాజా మాజీ సర్పంచ్ తూనం శోభ ఆత్మహత్యకు యత్నించింది. మాడుగులపల్లి మండల కేంద్రంలోని తన నివాసంలో బుధవారం బొద్దింకల మందు (హిట్) తాగింది. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపానికిలోనై ఆమె బలవన్మరణానికి యత్నించినట్లు తెలుస్తోంది. శోభ భర్త రవికి కొంతకాలంగా కొంతమందితో ఆర్థిక పరమైన విషయాల్లో వివాదాలు నడుస్తున్నాయి. ఈ విషయమై ఉదయం వారు మాట్లాడేందుకు రాగా ఆమె మనస్తాపం చెంది ఇంట్లోకి వెళ్లి బొద్దింకల మందు తాగింది. స్థానికులు 100 ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి బాధితురాలిని చికిత్స నిమిత్తం నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. కొంతకాలంగా శోభ దంపతులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. రెండ్రోజుల క్రితమే ఆమె స్వగ్రామానికి వచ్చినట్లు తెలిసింది. ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు.

ముగిసిన కబడ్డీ పోటీలు


మొదటి బహుమతి అందుకుంటున్న సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే జట్టు

- ప్రథమ బహుమతి సౌత్ సెంట్రల్ రైల్వేస్ జట్టు కైవసం

గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో ఆల్ ఇండియా మహిళా కబడ్డీ పోటీల్లో సౌత్ సెంట్రల్ రైల్వేస్ సికింద్రాబాద్, హర్యానా జట్టుల మధ్య హోరా హోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ సెంట్రల్ రైల్వేస్ జట్టు విజయం సాధించింది. ప్రథమ బహుమతి కింద ఆ జట్టు రూ.లక్ష నగదుతో పాటు షీల్డ్ అందుకుంది. హర్యానా జట్టు ద్వితీయ బహుమతి గెలిచుకొని రూ.90వేలు, షీల్డు అందుకుంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు సాగిన డే అండ్ నైట్ కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో 13జట్లు 195 మంది క్రీడాకారులు, టీమ్ కోచ్‌లు పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్ తృతీయ స్థానం పొందింది. రూ.80వేలు, షీల్డు అందజేశారు. నాల్గువ బహుమతి ఆంధ్రప్రదేశ్, ఐదవ బహుమతి బెంగుళూర్ సిటీ, ఆరవ బహుమతి గురుకుల హర్యానా టీమ్, ఏడవ బహుమతి ఎస్ఎస్ఎస్ పానిపట్టు హర్యానా టీమ్, ఎనిమిదో బహుమతి ఎస్ఎస్‌పీ గుజరాత్ టీమ్, తొమ్మిదవ బహుమతి ఎస్ఎస్ అకాడమీ ఢిల్లీ, పదో బహుమతి పీటీబీ పుణే సాధించినట్లు క్రీడల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సుందరి నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీశ్వర్ యాదవ్, జగన్‌మోహన్‌లతో పాటు సూర్యాపేట, నల్లగొండ జిల్లాల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు రామినేని భూలోకరావు, రాందర్, అన్నపురెడ్డి అప్పిరెడ్డి, గుండెపునేని చక్రధర్‌రావు, జుట్టుకొండ సత్యనారాయణ, చలసాని శ్రీనివాస్, క్రీడల నిర్వహణ కమిటీ సభ్యులు హాజరయ్యారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద మొత్తంలో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని కబడ్డీ పోటీలను తిలకించారు.


రెండో బహుమతి అందుకుంటున్న హరియాణ టీమ్

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824430]

BUSINESS OFFER

■మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9389214214. [HA-787728]

■కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252668]

■ద్వారక ఎంటర్‌ప్రైజెస్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1438]

Wanted

■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9030675274. [M-1233793]

■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ మేసేజీలు పంపుతూ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95027 12418, 90306 12463 [M-1233799]

■నల్లగొండ పట్టణంలో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను / Male Part Time Works కావలెను. సంప్ర॥ 7680038452 [Y-798313]

■నల్లగొండ పట్టణంలో గల ప్రముఖ ఆఫీస్ నందు పనిచేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. నల్లగొండ. లోకల్ వారు సంప్ర॥ 8309757355 [Y-798427]

■హరేకృష్ణ హోమ్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899. [H-793694]

■ప్రముఖ సెక్యూరిటీ కంపెనీ నందు అనుభవజ్ఞులైన సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్, హెడ్‌గార్డ్స్ & సెక్యూరిటీగార్డ్స్ ఒక సిమెంట్ ప్లాంట్‌లో పని చేయుటకు కావలెను @ జగ్గయ్యపేట, కోదాడ, తెలంగాణ, TS కనీస వేతనాల ప్రకారం 8 గం॥ / 26 రోజులకు జీతం+EPF & ESIC+వసతి ఉచితం. Ph: 9885287841/ 9701900766 [HA-1252]

ప్రకటన కొంచెం! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్గొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి తదుపరి ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

యాసంగి వరిచేలకు తెగుళ్ల బెడద

- ఎండిపోతున్న చేలు.. ఆందోళనలో రైతులు
- నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్

పెద్దవూర: వాతావరణంలోని మార్పులతో యాసంగి వరి పంటకు తెగుళ్లు ఆశిస్తున్నాయి. అసలే నీటి ఎద్దడి.. ఆపై తెగుళ్ల బెడదతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులు, ఎండ, చల్లదనం వలన యాసంగి వరిపంటపై సుడిదోమ, కాండం తొలిచే పురుగు, రసం పీల్చేపురుగులు, తుప్పు తెగులు, మాగుడు వంటివి ఎక్కువగా ఆశిస్తాయని, వీటి నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను పెద్దవూర వ్యవసాయ అధికారి పి.సందీప్‌కుమార్ ‘సాక్షి’కి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఎర్రనల్లి తెగులు : రసం పీల్చేపురుగుల్లో ఎర్రనల్లి ప్రమాదరకమైంది. ఈ తెగులు ఎండలు అధికంగా ఉన్నప్పుడు ఎక్కువగా వ్యాపిస్తుంది. వర్షాకాలంలో మాన్‌సూన్ బ్రేక్ వచ్చినప్పుడు ఈ తెగులు పంటను ఆశిస్తుంది.

తెగులు లక్షణాలు: ఇది సోకిన వరిపంట ఎదుగుదల నిలిచిపోతుంది. ఆకులను ఆశించిన ఎర్రనల్లి పత్రహరితాన్ని తినివేయడంతో ఎర్రబడిపోతాయి. కిరణజన్య సంయోగ క్రియ జరగకపోవడంతో మొక్క ఎదుగుదల నిలిచిపోతుంది.


తెగులు సోకి ఎండిపోయిన వరిచేను

నివారణ చర్యలు: ఎర్రనల్లి పురుగులను నివారించటానికి లీటర్ నీటిలో 5 మి.లీ. డైకోఫాల్ లేదా 3 గ్రాముల నీటిలో కరిగే గంధకం కలిపి పిచికారీ చేయాలి. ఇలా 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

మాగుడు లేదా పొడతెగులు : గ్రామీణ ప్రాంతాల్లో ఈ తెగులును మాగుడు లేదా పొడతెగులు అంటారు. ఈ తెగులు అధిక ఎండలు, గాలిలో తేమశాతం 90శాతం ఉన్నప్పుడు వ్యాప్తి చెందుతుంది. ఇది ఆశించిన చేను చూస్తుండగానే ఎండిపోతుంది.

నివారణ చర్యలు: ఈ తెగులు సోకిన పంటకు ముందస్తుగా రైతులు ఎంతమేర సోకిందనేది గుర్తించాలి. దీని నివారణకు ఎకరానికి 400 మి.లీ. ఎక్సోకోనోజాల్ పిచికారీ చేయాలి. లేదా 200 మి.లీ. పిప్రికోనోజాల్ లేదా 400 మి.లీ.వాలిడామైసిన్‌ను ఒక మిల్లీలీటర్‌కు 2 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలి. వీటిని రెండో దఫాగా 15 రోజులకు పిచికారీ చేయాలి.



తుప్పు తెగులు : ఈ తెగులు ఆశించిన వరి ఆకులపై గోధుమ వర్ణంలో తుప్పు పట్టినట్లుగా మచ్చలు ఏర్పడి క్రమేపీ పెద్దవై ఆకులో పత్రహరితం లేకుండా పోతుంది. ఇలా అవడం వలన ఆకులు ఎండిపోయి క్రమేణ దుబ్బు కూడా ఎండిపోతుంది. ఈ తెగులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చూస్తుండగానే చేను ఎండిపోతుంది.

నివారణ చర్యలు: ఎకరానికి 200 గ్రాముల కార్బండిజమ్‌ను తీసుకుని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన వారం రోజులకు మచ్చలు ఇంకా ఉన్నట్‌లైతే మరో దఫా పిచికారీ చేయాలి.

అగ్గితెగులు : ఈ తెగులు గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు వ్యాప్తి చెందుతుంది. ఇది ఆశించిన చేలు ఆకులపై ముదురు గోధుమ మచ్చలు, ఆకులు ఎండిపోయి తగులబడినట్లుగా కనిపిస్తాయి. వెన్ను మెడభాగంలో ఈ తెగులు వ్యాపిస్తుంది. వెన్ను విరిగిపోతుంది. అంతేకాకుండా ఎరువుల్లో నత్రజని ఎక్కువైనప్పుడు కూడా ఈ తెగులు ఆశిస్తుంది.

నివారణ చర్యలు: ఈ తెగులు ఆశించిన చేల చుట్టూ గట్లపై గడ్డిని పూర్తిగా నివారించాలి. లీటర్ నీటిలో 6 గ్రా. ట్రైసైక్లోజోల్‌ను కలిపి పిచికారీ చేయాలి.

ఎండు ఆకుతెగులు: ఇది బ్యాక్టీరియా వలన వస్తుంది. ఆకుల అంచుల నుంచి పసుపు రంగుకి మారి ఆకులు క్రమేపీ ఎండిపోతాయి. ఎక్కువగా అధిక వర్షాలు కురిసినప్పుడు గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు ఆశిస్తుంది.

నివారణ చర్యలు: ఇది సోకిన వరి చేలు చూస్తుండగానే ఎండిపోతాయి. నివారణకు ఎకరాకు 500 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచుపురుగు: ఇది పంట చిరుపొట్టదశలో ఉన్నప్పుడు ఆశిస్తుంది. దీనివలన పంట ఈనిన తర్వాత తెల్ల కంకులు ఏర్పడతాయి. దీని నివారణకు ఎకరాకు 60మి.లీ. కారజోన్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సుడిదోమ : సుడిదోమ కాండం మొదలుకు చేరి రసం పీల్చివేయడంతో ఆకులు పసుపు రంగులోకి మారిపోయి సుడులుసుడులుగా ఎండిపోతుంది. దీనిని త్వరగా అరికట్టకపోతే చేను అంతా ఎండిపోతుంది.

నివారణ చర్యలు: వరిదుబ్బుకి దోమలు 10 నుంచి 15 ఉంటే ఎకరానికి 120 మిల్లీలీటర్ల మెట్రోజోల్ మందును, 25 నుంచి 50 దోమలు ఉంటే ఎకరానికి 300 మి.లీ. హితోఫెన్‌ప్లాక్స్‌ను, 50 దోమలు దాటితే దీని తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వీని నివారణకు ఎకరానికి 300 మి.లీ. ఎసిఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.